సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 15 । మార్చి । 2023



మోదీ పాలనలో..
మోదీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ధ్వజమెత్తారు. - 10లో



అప్రమత్తంగా ఉండాలి
సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
36°/21°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డబుల్ బెడ్ రూం ఇళ్లకు 3,591 దరఖాస్తులు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీకి సంబంధించి పట్టణంలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన 444 డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేసేందుకు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 11న దరఖాస్తు గడువు ముగియగా.. 12వ తేదీ వరకు పొడిగించారు. దీంతో మొత్తం 3,591 దరఖాస్తులు వచ్చాయి. తుది జాబితా కోసం సోమవారం రాత్రి వరకు అధికారులు లబ్ధిదారుల జాబితాను వార్డుల వారీగా సేకరించారు. 3,591 దరఖాస్తుల్లో ఇప్పటివరకు 2,945 పరిశీలించారు. 646 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 35 వార్డులకు 12 ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 12 మంది మండల అభివృద్ధి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్హుల జాబితా సిద్ధం చేయనున్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయ స్వామిని భక్తులు మొక్కుకొని పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.19,56,218 నిత్య ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : భువనగిరి పట్టణంలోని డయాగ్నోస్టిక్ హబ్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ చిన్ననాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పథోలోజిస్ట్ 1, బయోకెమిస్ట్ 1, మైక్రోబయోలిస్ట్ 1, రేడియోలజిస్ట్ 1, ల్యాబ్ మేనేజర్ 1, రేడియోగ్రాఫర్ 1(మగ), ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డాటా ఎంట్రీ ఆపరేటర్స్ 1, ఫార్మసిస్ట్ 1, శానిటేషన్ హెల్పర్ 1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 15, 16వ తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో దరఖాస్తులను అందించాలని కోరారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బొమ్మలరామారం : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని జయించాలని బీబీనగర్ ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయికృష్ణ అన్నారు. మంగళవారం బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షా సమయంలో విద్యార్థులు ఎలాంటి మానసిక వేదనకు, ఒత్తిడికి గురికావద్దన్నారు. మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాయాలన్నారు. పలు ఆరోగ్య సూత్రాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, ప్రిన్సిపాల్ స్వప్న, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు రాష్ట్రపతి నిలయం ఉచిత సందర్శన

భువనగిరి : హైదరాబాద్‌లోని బొల్లారంలో గల రాష్ట్రపతి నిలయం సందర్శనలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉంటుందని డీఈఓ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి సందర్శన ప్రారంభమై ఈ సంవత్సరం చివరి వరకు ఉంటుందని పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు ప్రవేశానికి రూ.50లు ప్రవేశ రుసుము ఉంటుందని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రం ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనధికార నిర్మాణాలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు

- అందుబాటులోకి టీఎస్ బీపాస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్
- పర్యవేక్షించనున్న రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం
- త్వరలో కలెక్టరేట్‌లో అవగాహన కల్పించనున్న అధికారులు



భువనగిరిటౌన్: మున్సిపాలిటీల్లో అనధికారిక నిర్మాణాలపై నేరుగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారికంగా టీఎస్ బీపాస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయం ఈ పోర్టల్‌ను పర్యవేక్షిస్తుంది. ప్లాట్లు, అక్రమ వెంచర్లు, లేఅవుట్లు, ప్రభుత్వ స్థలాల కబ్జా, చెరువు శిఖం భూముల్లో నిర్మాణాలపైనా ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేయొచ్చు. సదరు ఫిర్యాదుదారుడు ఇది అక్రమ నిర్మాణమని నిరూపించే ధ్రువీకరణ, అందుకు సంబంధించిన ఫొటోలు పొందుపర్చాల్సి ఉంటుంది.

పరిశీలనకు మూడు బృందాలు

ఈ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి మూడు బృందాలను ఏర్పాటు చేశారు. మొదటి దశ బృందం (ఎల్ 1)లో తహసీల్దార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, అగ్నిమాపక, రోడ్లు, భవనాల శాఖ అధికారులతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, రెండో దశలో కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారి, మూడో దశలో అదనపు కలెక్టర్, కలెక్టర్‌తో కూడిన బృందాలు ఉంటాయి. అయితే ఫిర్యాదుల విభాగం అందుబాటులోకి వచ్చిన విషయం చాలా మందికి తెలియకపోవడంతో ఇంతవరకు మున్సిపాలిటీల్లో ఎలాంటి దరఖాస్తులు రాలేదు.

త్వరలో అవగాహన..

జిల్లాలో భువనగిరి, పోచంపల్లి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, మోత్కూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు త్వరలో కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. గతంలో టీఎస్ బీపాస్ ద్వారా నిర్మాణ అనుమతులు తీసుకున్నారు. ప్రస్తుతం మున్సిపల్ శాఖ టీఎస్ బీపాస్‌లో నూతనంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్ ఏర్పాటు చేసింది. దీంతో సులువుగా అనుమతి ఇచ్చిన తరువాత కూడా మరోసారి ఫిర్యాదు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈమేరకు అధికారులు చేయాల్సిన విధులు, దరఖాస్తుల పరిశీలన కోసం చేయాల్సిన విధానం గురించి కలెక్టరేట్‌లో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమంలో వివరించనున్నారు.

అవగాహన అనంతరం ప్రజలకు వివరిస్తాం

నూతనంగా మున్సిపల్ శాఖ వారు తీసుకువచ్చిన టీఎస్ బీపాస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్ గురించి అధికారులు అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నారు. పూర్తి స్థాయిలో అవగాహన కల్పించిన తరువాత ప్రసార మాధ్యమాలు, సమావేశాల ద్వారా పట్టణ ప్రజలకు వీటి గురించి తెలియజేస్తాం.

– కృష్ణవేణి, టౌన్‌ప్లానింగ్ అధికారి, భువనగిరి మున్సిపాలిటీ

31 కేంద్రాలు.. 13,309 మంది విద్యార్థులు

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



భువనగిరిలోని కళాశాలలో హాల్ టికెట్ నంబర్లను పరిశీలిస్తున్న సీఎస్, డీఓలు

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు మొత్తం 31 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 13,309 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,206, ద్వితీయ సంవత్సరం వారు 7,103 మంది ఉన్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. నిమిషం ఆలస్యమైనా అధికారులు కేంద్రంలోకి అనుమతిని నిరాకరించనున్నారు.

ఆటల్లో గెలుపోటములతో సంబంధం లేదు

- కలెక్టర్ పమేలా సత్పతి



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్ : గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటల పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు చింతల రామచంద్రారెడ్డి, చిత్రంలో పీవీ శ్యాంసుందర్‌రావు, సూదగాని హరిశంకర్ గౌడ్ తదితరులు

సాక్షి,యాదాద్రి : రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ బూత్ స్వశక్తి కరణ్ అభియాన్, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రసంగం శక్తి సమ్మేళనాన్ని మంగళవారం భువనగిరిలోని రావి భద్రారెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. టీఆర్‌ఎస్ వైఫల్యాలను వివరిస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం బూత్‌లను పటిష్టం చేయడమేనన్నారు. స్వల్పకాలిక విస్తారక్‌లు తమకు కేటాయించిన బూత్‌లలో పనిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పటిష్టతకు శ్రేణులన్నీ పాటుపడుతున్నాయని తెలిపారు. ప్రధాని మోదీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, జనగాం జిల్లా ఇన్‌చార్జ్ పాపారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, పాశం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్ల నర్సింగ రావు, రాఘవుల నరేందర్, ఆలేరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పడాల శ్రీనివాస్, జనగాం ప్రబారి సూదగాని హరిశంకర్ గౌడ్, స్టేషన్ గన్పూర్ పాలక్ వట్టిపల్లి శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, చిరిగే శ్రీనివాస్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షుడు చందా మహేందర్, కౌన్సిలర్లు రత్నపురం బలరాం, జనగాం కవిత పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాలు ఇవ్వాలి

- జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పక్కన కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి : వ్యవసాయ రంగానికి అధిక రుణాలు ఇవ్వాలని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి బ్యాంకర్లను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో డిసెంబర్ చివరి వరకు త్రైమాసిక రుణ ప్రగతిపై కలెక్టర్ పమేలా సత్పతి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన కోళ్లు, కూరగాయలు, గొర్రెల పెంపకానికి రుణాలు ఇవ్వాలన్నారు.

నెలాఖరులోగా పూర్తి చేయాలి

ఈ నెలాఖరులోగా రుణాల మంజూరు పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బ్యాంకర్లు లబ్ధిదారుల దరఖాస్తులను తిరస్కరించేటప్పుడు కావాల్సిన సలహాలు, కారణాలను దరఖాస్తుదారునికి తెలియజేయాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా లీడ్ బ్యాంక్ మేనేజర్ పర్యవేక్షించాలన్నారు. ఇప్పటి వరకు రూ.1,856 కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వగా అందులో పంట రుణాలు రూ.919 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.937 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకు రూ. 269 కోట్ల రుణాలు, ప్రాధాన్యతా రంగాలకు రూ. 78 కోట్లు, విద్యా రుణాలు రూ.76 కోట్లు, గృహ రుణాలు రూ.40 కోట్లు, జిల్లాలో ఉన్న 12,747స్వయం సహాయక మహిళా సంఘాల్లో 7511 సంఘాలకు రూ. 586 కోట్లకు గాను రూ.433 కోట్లు అందించి 74 శాతాన్ని సాధించినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లో ఒక శాతం మాత్రమే ఎన్.పి.ఎ. (మొండి బకాయిలు) కలిగి రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మెప్మా కింద బ్యాంక్ లింకేజ్ రుణాలకు సంబంధించి ఆరు మున్సిపాలిటీల్లో 2,688 మంది వీధి వ్యాపారులకు ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున రూ. 5.37 కోట్లు అందించామని చెప్పారు. రూ. 20 వేలు పూర్తిగా చెల్లించిన వారికి మూడో విడత కింద రూ. 50 వేల రుణం మంజూరు చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. 680 మెప్మా సంఘాలకు రూ. 42.50 కోట్ల లక్ష్యానికి 503 సంఘాలకు రూ. 33.93 కోట్లు ఇచ్చామన్నారు. బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి, అడ్డగూడూరు మండలం సింగారం గ్రామాల్లో బ్రాంచీలు ప్రారంభించాలని బ్యాంకు కంట్రోలర్స్‌కు సూచించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి శ్రీరామకృష్ణ, రిజర్వ్ బ్యాంక్ ప్రతినిధి విభవ్ వ్యాస్, నాబార్డు డీడీఎం వినయకుమార్, కేవీబీసీ ప్రతినిధి సంజీవరావు, డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జిల్లా పశుసంవర్ధక అధికారి కృష్ణ, మెప్మా పీడీ రమేశ్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు భూసర్వే అడ్డగింత



చౌటుప్పల్ మండలం నేలపట్లలో ఆర్ఐతో వాగ్వాదానికి దిగిన రైతులు

చౌటుప్పల్, వలిగొండ : చౌటుప్పల్ మండల పరిధిలోని నేలపట్ల గ్రామ రెవెన్యూ పరిధిలో మంగళవారం చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు భూసర్వేను ఆర్ఆర్ఆర్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో రైతులు అడ్డుకున్నారు. సర్వే చేయనివ్వబోమని భీష్మించుకుని కూర్చున్నారు. అంతేకాకుండా అధికారుల వద్ద పేపర్లు చించివేశారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రీజినల్ రింగ్ రోడ్డు తమకు వద్దని, అలైన్‌మెంట్ మార్చాలని నినాదాలు చేశారు. దీంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు, మండల సర్వేయర్ మురళీధరన్‌లు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చేసేదేమీ లేక అక్కడి నుంచి వెనుదిరిగారు. అదేవిధంగా వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి గాను భూసర్వే కోసం వచ్చిన రెవెన్యూ అధికారులను రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకుడు తంగళ్లపెల్లి రవి కుమార్ అడ్డుకున్నారు. ప్రభుత్వ అధికారులు భూసర్వే కోసం రైతులకు నోటీసులు జారీ చేయలేదని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేనిపక్షంలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

భువనగిరి : ఒంటి పూట బడులు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ప్రభుత్వం 13వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం మొదటి పిరియడ్ ఉదయం 8 గంటల నుంచి 8.40 గంటల వరకు, రెండో పిరియడ్ 8.40 నుంచి 9.20, మూడో పిరియడ్ 9.20 నుంచి 10 గంటల వరకు ఉంటుంది. ఉదయం 10.00 నుంచి 10.20 వరకు స్వల్ప విరామం, నాల్గవ పిరియడ్ 10.20 నుంచి 11 గంటల వరకు, ఐదవ పిరియడ్ 11 గంటల నుంచి 11.40, ఆరవ పిరియడ్ 11.40 నుంచి 12.30 గంటల వరకు ఉంటుంది. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు యాథావిధిగా నిర్వహిస్తున్నారు. వీరికి బుధవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు ప్రీ ఫైనల్- 2 పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు సుమారు 8,645 మంది ఉన్నారు.

రెవెన్యూ బదిలీలపై పీటముడి

- ఒక తహసీల్దార్ బదిలీ విషయంలో తలెత్తిన సమస్యతో నిలిచిన ఫైల్
- సీసీఎల్ఏ నుంచి యాదగిరిగుట్టకు బదిలీపై రావడంపై అనాసక్తి
- 15 రోజులుగా పెండింగ్‌లోనే బదిలీల ఫైల్

సాక్షి, యాదాద్రి : జిల్లా రెవెన్యూ శాఖలో బదిలీలపై పీటముడి పడింది. గడిచిన పదిహేను రోజులుగా బదిలీలపై కసరత్తు జరుగుతున్నా ఫైల్ ముందుకు కదలడం లేదు. నలుగురు తహసీల్దార్లు, నలుగురు ఆర్ఐలు, 15 మంది వరకు సీనియర్ అసిస్టెంట్లను వివిధ కారణాలతో బదిలీ చేయడానికి జిల్లా రెవెన్యూ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. అయితే ఒక తహసీల్దార్ బదిలీ విషయంలో తలెత్తిన సమస్యతో మొత్తం బదిలీల ఫైల్ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. వీఆర్‌ఓలు ఇతర శాఖలకు బదిలీ అయిన తర్వాత పలు తహసీల్దార్ కార్యాలయాల్లో శాఖాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈక్రమంలో అన్ని కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ల భర్తీ అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని నిర్ణయించారు.

గుట్ట తహసీల్దార్ బదిలీపై..

యాదగిరిగుట్ట తహసీల్దార్ సీసీఎల్ఏ నుంచి జిల్లాకు ట్రైనింగ్ కోసం వచ్చారు. శిక్షణ పూర్తి కావడంతో ఆయన తిరిగి సీసీఎల్ఏకు బదిలీపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో సీసీఎల్ఏ నుంచి వచ్చే తహసీల్దార్ యాదగిరిగుట్టకు రావడానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం. అయితే జిల్లాలోని మరో తహసీల్దార్‌ను గుట్టకు బదిలీ చేసే క్రమంలో సర్దుబాటు జరగడం లేదని తెలుస్తోంది. చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ఒక తహసీల్దార్‌ను యాదగిరిగుట్టకు బదిలీ చేయాలని జిల్లా యంత్రాంగం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన ఓ తహసీల్దార్ తిరిగి ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతుండగా ఎవరో అడ్డుకుంటున్నారని సమాచారం. దీంతో యాదగిరిగుట్ట లాంటి పుణ్య క్షేత్రానికి ఎవరిని తహసీల్దార్‌గా వేయాలోనన్న చిక్కుముడితో బదిలీల ఫైల్ నిలిచింది. నిత్యం వీవీఐపీలు వచ్చే గుట్టలో ప్రొటోకాల్ విధులు కత్తిమీది సాములా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో కొత్తగా వచ్చేవారు ఆసక్తి చూపడం లేదనే చర్చ జరుగుతోంది. మరోవైపు బదిలీల కోసం రెవెన్యూ అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

చౌటుప్పల్‌లో ట్రాఫిక్ కష్టాలు

- హైవేతో పాటు సర్వీస్ రోడ్లలోనూ నెలకొంటున్న సమస్య
- వీకెండ్, సెలవు దినాల్లో మరీ అధికం
- దుకాణాల ఎదుట ఇష్టానుసారంగా పార్కింగ్
- అవస్థలు పడుతున్న స్థానికులు, వాహనదారులు



చౌటుప్పల్‌లోని సర్వీస్ రోడ్డులో స్తంభించిన వాహనాలు



రద్దీ కారణంగా ఇబ్బందిగా మారిన వాహనాల రాకపోకలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ప్రధానంగా జాతీయ రహదారితో పాటు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లలో ఈ సమస్య తీవ్రంగా నెలకొంది. ఆయా రోడ్లపై రాకపోకలు సాగించాలంటే జనం జంకుతున్నారు. ఎక్కడా ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. ఊరు పెరుగుతున్నా రోడ్ల విస్తరణ లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని పట్టణవాసులు పేర్కొంటున్నారు.

ప్రతినిత్యం రద్దీ

గతంలో కేవలం జాతీయ రహదారిపైనే ట్రాఫిక్ సమస్య ఉండేది. కానీ ప్రస్తుతం ఈ సమస్య హైవేకు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లలోనూ నెలకొంది. ఐదారేళ్ల క్రితం కేవలం పండుగల సమయాల్లోనే హైవేపై వాహనాల రద్దీ ఉండేది. కానీ ప్రస్తుతం ప్రతినిత్యం రద్దీ ఉంటుంది. వీకెండ్, సెలవు దినాలు, పండుగ సమయాల్లో అయితే క్షణం ఖాళీ లేకుండా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదే సమస్య ఇప్పుడు సర్వీస్ రోడ్లలోనూ తయారైంది. వలిగొండ క్రాస్ రోడ్డు నుంచి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే మార్గం వరకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల వెంట ఈ సమస్య తీవ్రంగా ఉంది.

ఫుట్‌పాత్‌లపై బైకుల పార్కింగ్..

పట్టణ కేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించారు. సర్వీస్ రోడ్ల వెంట డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేశారు. ఆయా డ్రెయినేజీ కాలువలనే ఫుట్‌పాత్‌లుగా చేసుకొని చిరువ్యాపారులు రకరకాల వ్యాపారాలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం సర్వీస్ రోడ్ల వెంట ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలంటే అధికారులు ఫుట్‌పాత్‌లపై దృష్టిసారించాలి. రోడ్లపై నిలిపే ద్విచక్రవాహనాలను ఫుట్‌పాత్‌లపై నిలిపే విధంగా చర్యలు చేపట్టాలి. దీంతో సర్వీస్ రోడ్లపై ట్రాఫిక్ సమస్యకు దాదాపుగా పరిష్కారం లభిస్తుంది.

ఈ సమయాల్లో అధికం..

ఆఫీస్ టైమింగ్స్‌లో సర్వీస్ రోడ్లపై వాహనాల రాకపోకలు సాగించలేని పరిస్థితి. ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7గంటల వరకు సర్వీస్ రోడ్లు అత్యంత రద్దీగా ఉంటున్నాయి. ఆయా సమయాల్లో వివిధ దుకాణాల వద్దకు వచ్చే వాహనదారులు తమ వాహనాలను సర్వీస్ రోడ్ల వెంటే నిలుపుతున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. ఈ క్రమంలో వాహనదారుల నడుమ గొడవలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఎప్పుడు ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

ఇష్టానుసారంగా వాహనాలు నిలపొద్దు



సర్వీస్ రోడ్లలో నిత్యం ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా నిలపొద్దు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించి దుకాణాదారులకు నోటీసులు ఇచ్చాం. రెండు వైపులా కాకుండా రోడ్డుకు ఒకవైపు మాత్రమే వాహనాలు పార్కింగ్ నిలుపుకునేలా సూచనలు చేశాం. ఇష్టానుసారంగా వాహనాలు నిలిపితే రికవరీ వ్యాన్ ద్వారా స్టేషన్‌కు తరలిస్తున్నాం.

– విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ

సర్వీస్ రోడ్లపైనే..

సర్వీస్ రోడ్లపై ట్రాఫిక్ సమస్యకు దుకాణాదారులు, చిరువ్యాపారులు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. దుకాణాల పేర్లకు సంబంధించి బోర్డులు, భవన నిర్మాణాల మెట్లు సర్వీస్ రోడ్డుపైనే ఏర్పాటు చేశారు. వాటికి తోడు ఆయా దుకాణాలకు వచ్చే కస్టమర్లు తమ వాహనాలను సర్వీస్ రోడ్లపైనే ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. అదేవిధంగా రోడ్లపై వ్యాపారం సాగించే చిరువ్యాపారులు సైతం సర్వీస్ రోడ్లపై తమ వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

క్లుప్తంగా

హైనా దాడిలో మూడు గొర్రెలు మృతి

రాజాపేట: మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామ శివారులో మంగళవారం హైనా దాడిలో మూడు గొర్రెలు మృతిచెందాయి. బాధితర రైతు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మక్కపల్లికి చెందిన నేతిగారి రమేష్ గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో ఇల్లు నిర్మించుకొని ఉంటూ అక్కడే గొర్రెలను పెంచుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున గొర్రెల మందపై హైనా దాడి చేసి మూడు గొర్రెలను చంపి ఓ గొర్రెను ఎత్తుకెళ్లింది. బాధితుడు గమనించి పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ. 20వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొంటున్నాడు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

మాడుగులపల్లి: చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాడుగులపల్లి ఎస్ఐ కైగూరి నరేష్‌కుమార్‌తో కలిసి ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన సింగం రమేష్, చందనబోయిన వెంకటేష్, మంత్రి నాగరాజు జల్సాలకు అలవాటు పడి ముఠాగా ఏర్పడి కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నెల 7న మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దదేవులపల్లి రెడ్డీస్ ల్యాబరేటరీలో, అదే గ్రామంలో పలువురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల వైర్లను చోరీ చేశారు. ఈ నెల 9న రైతులు జలంధర్, మైబెల్లి, గుండెబోయిన మట్టయ్య తమ మోటారు వైర్లు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ నరేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 70 వేల విలువైన రాగి తీగను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బావిలో పడి యువకుడు మృతి

నడిగూడెం: బావిలో పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని వల్లాపురం గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాపురం గ్రామానికి చెందిన మొక్క వెంకటనర్సు, లక్ష్మమ్మ దంపతుల చిన్న కుమారుడు శ్రీకాంత్(28) ఈ నెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో శ్రీకాంత్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే బావి వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ ఘటనపై నడిగూడెం ఎస్ఐ ఏడుకొండలును సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- గుర్రంపోడు మండలం తేనపల్లి గ్రామ శివారులో స్కూల్ బస్సు ఢీకొని ఒకరు..
- తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో వ్యాన్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సంపత్ మృతదేహం

గుర్రంపోడు: స్కూల్ బస్సు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని తేనపల్లి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ శివప్రసాద్ తెల్పిన వివరాల ప్రకారం .. చండూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు మంగళవారం విద్యార్థులను దించేందుకు తేనపల్లి గ్రామానికి వస్తూ గ్రామ శివారులో ఎదురుగా బైక్‌పై వస్తున్న నాంపల్లి మండలం చామలపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల శ్రీను(23)ను ఢీకొట్టింది. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు పెద్దవూర మండలం వెల్మగూడెం లో బొడ్రాయి పండుగకు వెళ్లి వస్తూ.. తేనపల్లిలోని తన బావ ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఇద్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఆటో డ్రైవర్..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్ గ్రామానికి చెందిన నూనె సంపత్(36) తన ఆటోలో తిరుమలగిరి నుంచి తొర్రూరు వైపు వెళ్తుండగా తొండ గ్రామ సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంపత్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడి బంధువుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ బాలకృష్ణ

చింతపల్లి: వేధింపులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండల పరిధిలోని కొత్రమాన్‌సింగ్‌తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్రమాన్‌సింగ్‌తండాకు చెందిన ఓ మహిళతో చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎర్ర శ్రీను వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తండాకు చెందిన కొత్ర లచ్చానాయక్(30) తెలియడంతో ఇరువురిని మందలించాడు. దీంతో సదరు మహిళ, ఎర్ర శ్రీనుతో పాటు మరో ఇద్దరు మహిళలు లచ్చానాయక్‌పై కోపం పెంచుకొని విషయాన్ని బయటికి చెప్తొద్దంటూ భయభ్రాంతులకు గురిచేసేవారు. వారి వేధింపులు భరించలేక లచ్చానాయక్ మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఇది గమనించిన బంధువులు వెంటనే అతడిని దేవరకొండ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో దారి దోపిడీ ముఠా?

నల్లగొండ క్రైం: రాత్రి సమయంలో రోడ్డు వెంట నిలిపిన లారీ డ్రైవర్లు, క్లీనర్లను బెదిరించి దారి దోపిడీకి పాల్పడుతున్న ఐదుగురు ముఠా సభ్యులను నల్లగొండ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. నల్లగొండ పట్టణ శివారులోని శేషమ్మగూడెం, కతాల్‌గూడెంతో పాటు హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు ముఠాగా ఏర్పడి దారి దోపిడీలకు పాల్పడుతున్నారని, వీరు ఇటీవల నల్లగొండ మున్సిపాలిటీ పరిధి పానగల్ సమీపంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రోడ్డుపై నిలిపిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను, దండంపల్లి-కట్టంగూర్ రోడ్డులో పానగల్‌కు వెళ్లే కాల్వ వద్ద నిలిపిన లారీ డ్రైవర్, క్లీనర్‌ను కత్తితో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లినట్లు సమాచారం. చౌటుప్పల్ వద్ద హైవేపై కూడా ఇలానే దారి దోపిడీకి పాల్పడినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. నిందితుల వివరాలను త్వరలోనే మీడియాకు వెల్లడిస్తామని నల్లగొండ టూటౌన్ పోలీసులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో భక్తాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



బొడ్రాయికి పూజలు చేస్తున్న భక్తులు

మోత్కూరు: మండలంలోని రాగిబావి గ్రామంలో శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయం 11వ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యావచనం, ఆంజనేయ స్వామికి సింధూరం, ఆకు పూజ, నవ గ్రహపూజ, రుద్రాభిషేకాలను పూజారి భాస్కరబట్ల శివానంద శర్మ నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలకు, బొడ్రాయికి మహిళలు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమాలు చేశారు. అనంతరం బొడ్రాయికి మహిళలు బోనాలతో వెళ్లి ప్రదర్శనలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంపాక నాగయ్య, ఉపసర్పంచ్ ఝెన్సం యాదవరెడ్డి, మాజీ ఎంపీటీసీ పానుగుల్ల విష్ణుమూర్తి, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, యాదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జూలూరు పీఏసీఎస్‌లో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లో అక్రమాలు జరిగాయని గత ఏడాది ఆడిట్‌లో అధికారులు పేర్కొన్నారని తెలిపారు. అంతేకాక ఇటీవల స్వయంగా అధికార పార్టీకి చెందిన డైరెక్టర్లే జరిగిన అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేనిచో మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. వెంటనే దుర్వినియోగమైన డబ్బును రికవరీ చేయాలని, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గూడురు అంజిరెడ్డి, పగిళ్ల లింగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు అందెల జ్యోతి, బొబ్బల బాలకృష్ణారెడ్డి, గట్టు రాంరెడ్డి, ఉడుతల జంగయ్య, కందాడి యాదిరెడ్డి, బానాల ఎల్లారెడ్డి, నాయకులు మధు, బుచ్చిరెడ్డి, జంగయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం కాని ఇసుక పంచాయితీ



ఇసుక ఎత్తేందుకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్‌తో గొడవ పడుతున్న కొరటికల్ గ్రామస్తులు

మునుగోడు : కొంతకాలంగా మునుగోడు మండలంలోని కొరటికల్, కనగల్ మండలం రేగట్టె గ్రామ ప్రజల మధ్య కొనసాగుతున్న ఇసుక పంచాయితీ తారస్థాయికి చేరుకుంది. కొరటికల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని జిల్లాయిపేట చెరువులో ఇసుక మేట వేసింది. ఆ చెరువులోని ఇసుకను రేగట్టె గ్రామానికి చెందిన ఇసుక వ్యాపారులు దొంగచాటున ఎత్తుకెళ్తున్నారు. ఇదే అదునుగా భావించిన చండూరు మండలం పడమటితాళ్ల గ్రామ ప్రజలు కూడా ఇసుక ఎత్తుకెళ్లడం మొదలుపెట్టారు. గమనించిన కొరటికల్ గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు చెరువు వద్దకు వెళ్లి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని అడ్డుకుని పోలీసులకు పట్టించే ప్రయత్నం చేశారు. మరొకమారు ఇసుక తీసుకెళ్లమని, తమను వదిలేయాలని బతిమిలాడటంతో కొరటికల్ గ్రామస్తులు అక్రమ వ్యాపారులను వదిలేశారు. అది గడిచి 10 రోజులు కాకముందే తిరిగి రేగట్టె గ్రామస్తులు మంగళవారం 10 ట్రాక్టర్లతో వచ్చి చెరువులో ఇసుక ఎత్తుతున్నారు. విషయం తెలిసిన కొరటికల్ గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి ఇసుక ఎత్తే వారిపై గొడవకు దిగారు. దీంతో అక్రమ వ్యాపారులు వారిని ట్రాక్టర్లతో ఢీకొట్టే ప్రయత్నం చేసి పరారయ్యారు. రెండేళ్ల క్రితం వాగు సరిహద్దు విషయంలో పోలీసు ఎదుట దాడులు చేసుకుంటే ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ, ఆర్డీఓలు వాగు సరిహద్దును నిర్ణయించారు. ఇప్పటివరకు శాంతంగా ఉన్న ఇరు గ్రామాల ప్రజలు తిరిగి రెండు నెలలుగా తగువులు పడుతున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు చొరవ తీసుకొని ఇరు గ్రామాల మధ్య తగువులు జరగకుండా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన బాలనాగమ్మ నాటకం



బాలనాగమ్మ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని అంజలీపురంలో నిర్వహిస్తున్న అంకమ్మ, పెద్దమ్మతల్లి బొడ్రాయి వార్షికోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు స్థానిక చెన్నకేశవస్వామి నాట్యకళామండలి ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటకం ప్రదర్శించారు. ప్రముఖ హార్మోనిస్టు వినాయకరాజు ఆర్కెస్ట్రాతో నాటకాన్ని రక్తికట్టించారు. స్థానికులు గొర్రె నాగరాజు, గోలి శ్రీను, ఆదిరెడ్డి, పిచ్చిరెడ్డి తదితర గ్రామ పెద్దల సహకారంతో ప్రదర్శించిన ఈ నాటకంలో కళాకారులు ఎస్‌కే సైదులు, ధర్మయ్య గౌడ్, బీవీ రామారావు, పి. వెంకటేశ్వర్లు, హనుమారెడ్డి, ఉప్పు కృష్ణ, శివశంకరాచారి, నజీర్, విజయ్, నటీమణులు వీరమణి, అశ్విని, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో బండ్ల ఊరేగింపు



సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నాగారం: ఫణిగిరిలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం బండ్ల ఊరేగింపు, గజసేవా, దోపోత్సవం, తీర్థప్రసాదాల వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఎడ్లబండ్లను అలంకారప్రాయంగా తయారు చేసుకొని రామాలయం ఎదుట ఉన్న గరుడ స్తంభం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఆవుల సతీష్, వైస్‌చైర్మన్ మామిడి మల్లయ్య, మంచినీళ్ల మహేందర్, చిరంజీవి, అనిల్, ఆలయ కమిటీ డైరెక్టర్లు మిరప అంజయ్య, గడ్డల ఉపేందర్, బెల్లంకొండ ఉప్పలయ్య, నల్ల రమేష్, సంపతి శంకరమ్మ, ఆలయ అర్చకులు సంతోష్‌కుమార్‌శర్మ, మాధవాచార్యులు, సాయి, దత్తు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

280 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చిట్యాల: బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 70 బస్తాలలోని 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు చిట్యాల ఎస్ఐ నకిరేకంటి ధర్మా మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం .. భువనగిరి మండలం పాచర్లబోడు తండాకు చెందిన బొంతు వెంకటేష్ వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామ శివారులోని లెంకల సత్తిరెడ్డికి చెందిన శ్రీతేజ ఫామ్స్‌లో నిల్వ చేశాడు. సోమవారం రాత్రి ఈ నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని హైదరాబాద్‌కు చెందిన సన్నీకి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు చిట్యాల పోలీసులు దాడి చేసి 280 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బొంతు వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టుబడిన పీడీఎస్ బియ్యానికి పంచనామా..

డిండి: అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యానికి పంచనామా నిర్వహించినట్లు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 18న నేరేడుగొమ్ము మండలం చిత్రియాల నుంచి అక్రమంగా 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడుతో డిండి వైపు వెళ్తున్న వాహనాన్ని పోలీసులు చెర్కుపల్లి గేటు సమీపంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పీడీఎస్ బియ్యానికి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో ఉన్నత స్థానాలకు..



మాట్లాడుతున్న రామకృష్ణ భరద్వాజ్

కోదాడఅర్బన్: విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యమని, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కృష్ణ గ్రూప్ సంస్థల చైర్మన్ రామకృష్ణ భరద్వాజ్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థినులకు వ్యక్తత్వ వికాసం, ప్రేరణ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు బీటెక్ పూర్తయిన వెంటనే కార్పొరేట్ సంస్థల్లో పనిచేసేందుకు కావాల్సిన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులకు ఉద్యోగాల సాధనకు ప్రణాళికలు ఎలా సిద్ధం చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. విజయ్‌కుమార్, అకాడమిక్ అడ్వైజర్ పి. నాగేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. నాగార్జునరావు, వివిధ విభాగాధిపతులు స్రవంతి, ఏఓ కృష్ణారావు, అధ్యాపకులు నర్సింహారావు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

డిండి: మండల పరిధిలోని ఎర్రారం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రారం గ్రామానికి చెందిన గోరటి ప్రశాంత్ గత నెల 18వ తేదీన ఇంటి నుంచి బయట వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ప్రశాంత్ ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి తల్లి లక్ష్మమ్మ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. ప్రశాంత్ మానసిక పరిస్థితి సరిగ్గా లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, మైహోం చైర్మన్ రామేశ్వరరావు తదితరులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ఆరాధన కార్యక్రమం, ధ్వజారోహణం, సహస్రకమలార్చన, లక్ష కుంకుమార్చన, మంగళాశాసనం, ఎదుర్కోలు, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, మునగాల రామ్మోహన్‌రావు, అరుణ దంపతులు, పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు, ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బత్తాయి రైతును ముంచుతున్న 'మంగు'

- నివారణకు నల్లగొండ ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మర్రి వెంకటేశం సూచనలు

పాడి పంట



చెట్టు మీద మంగు సోకిన కాయలు



మంగు సోకిన కాయలు

గుర్రంపోడు : బత్తాయి రైతులను ఈ సీజన్‌లో మంగు నిండా ముంచుతోంది. నల్లగొండ జిల్లాలో సాగవుతున్న 45వేల హెక్టార్ల బత్తాయి తోటల్లో ఎంతోకొంత మంగు ఆశించని తోట అంటూ లేదంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో చెప్పవచ్చు. కాయలపై వక్క లేదా ఊదా రంగు లేదా ముదురు గోధుమరంగు ఏర్పడటాన్ని మంగు అంటారు. ప్రస్తుతం సీజన్ బత్తాయి కాయలు మంచి సైజును సంతరించుకునే దశలో ఉన్నాయి. వాతావరణంలో మార్పులు, మబ్బులు, తరుచు చిరుజల్లులు పడటం వల్ల మంగు తీవ్రత ఈ ఏడాది ఎక్కువగానే ఉంది. ఈ దశలో బత్తాయిలో మంగును నివారించి విలువైన కత్తెర బత్తాయి పంటను కాపాడుకోవడంపై నల్లగొండ ప్రాంతీయ ఉద్యానవనశాఖాధికారి మర్రి వెంకటేశం అందిస్తున్న సలహాలు, సూచనలు.

నల్లి పురుగులతోనే..

బత్తాయి కాయలపై మంగు ఏర్పడటానికి ప్రధాన కారణం మంగునల్లి. ఈ నల్లులు కంటికి కనిపించనంత చిన్నవిగా ఉంటాయి. వీటిని భూతద్దంలో సులభంగా చూడవచ్చు. వీటి పిల్లలు పసుపు రంగులోనూ, పెద్ద నల్లులు ఆరంజి రంగులోనూ ఉంటాయి. పిల్ల, పెద్ద మంగు నల్లులు పిందెలు, కాయలపైన పొరాడుతూ తొక్కల నుంచి రసం పీల్చుతాయి. రసాన్ని పీల్చే ప్రక్రియలో నల్లి నోటి నుంచి రసాయాన్ని వదులుతుంది. ఈ రసాయనం కాయతోలు నుంచి స్రవించిన ద్రవం, సూర్యరశ్మి మార్పు చెంది తుప్పురంగు మారుతుంది. అందుకే బయటకు కనిపించే, సూర్యరశ్మి తగిలే కాయల్లో మంగు బాగా కనిపిస్తుంది. బత్తాయి పిందెలకు నల్లి ఆశిస్తే కాయ సైజు తగ్గదు కాని మంగు వచ్చి తోలు గట్టిపడి పెలుసుగా మారుతుంది. కాయ రుచిలో తేడా రాదు. అయినా మంగు కాయలకు తోలు గట్టిపడి పెలుసుగా మారి చూడటానికి నల్లగా కనిపిస్తున్నందున మార్కెట్‌లో ధర పలకదు. వ్యాపారులు కూడా తోటల్లో కొద్దిగా మంగు ఉన్నా చాలా ఎక్కువగా మంగు ఉందంటూ తక్కువ రేటుకు తీసుకుంటారు.

మంగు నల్లి నివారణ

రైతులు భూతద్దం సహాయంతో నల్లి ఉనికిపై నిఘా ఉంచాలి. ఒకటి, రెండు నల్లులు తోటలో ఎక్కడైనా పిందెలు, కాయలపై కనిపించగానే స్ప్రేయింగ్ మొదలు పెట్టాలి. రైతులందరూ సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలి. చెట్లలో కొమ్మల కత్తిరింపులు సక్రమంగా సకాలంలో చేసి చెట్టు లోపల గాలి వెలుతురు బాగా ప్రసరించేటట్లు చూడాలి. తోటల్లో ఎండు పుల్ల కత్తిరించిన వెంటనే లీటరు నీటికి 3గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలి. ఈ రాగి దాతువు శిలీంద్రనాశిని కత్తిరించిన కొమ్మలకు రక్షణ ఇవ్వడమేగాక నల్లికి ప్రతికూలంగా ఉంటుంది. మంగునల్లిపై ఇటీవల పరిశోధనా కేంద్రాల్లోనూ, రైతు పరిశీలనల్లో కొన్ని రకాల మందులు నల్లిని సమర్థవంతంగా అరికట్టినట్లు తెలిసింది. లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల ప్రాపర్‌గైట్ లేదా ఒక గ్రాము డైపెంథిరాన్ లేదా రెండు మిల్లీ లీటర్ల ఇథియాన్ లేదా 5 మిల్లీ లీటర్ల డైకోఫాల్ వంతున కలిపి మందు మార్చుతూ అవసరాన్ని బట్టి వారానికి ఒకసారి చొప్పున రెండు దఫాలుగా చెట్టంతా తడిసేలా పిచికారీ చేయాలి. లీటరు నీటికి 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్, 5 గ్రాముల మల్టీకే ఒక మారు పిచికారీ చేస్తే నల్లిని అణిచివేయడంతోపాటు కాయసైజు నాణ్యత పెరుగుతుంది. నీటి తడులు ఎక్కువ కాకుండా అవసరం మేరకు డ్రిప్ పద్ధతిలో అందించాలి. సిఫారసు మేరకు సమతుల సమగ్ర ఎరువులు సకాలంలో అందించాలి. తోటలో అంతర కృషి బాగా చేసి పరిశుభ్రతను పాటించాలి.

వాతావరణంలో మార్పులతో..

క్రమంగా వేడి వాతావరణం పెరిగే ఫిబ్రవరి, మార్చి నెలల మబ్బులు, వర్షాలతో కూడిన వాతావరణానికి మారుతున్న సమయం మంగు ఉధృతికి ఎక్కువగా దోహదం చేస్తాయి. అధిక వర్షానికి పురుగులు చెట్టు నుంచి జారి కిందపడి నశిస్తాయి. వర్షాలు తక్కువగా ఉంటే నల్లి పురుగులు చెట్లపైనే ఆవాసాన్ని ఏర్పరుచుకుని స్థిరంగా ఉంటాయి.